# అనంతం

అనంతపథాన ఇద్దరు సూక్ష్మజీవులు కలుసుకున్నారు. అదొక అపూర్వ సంఘటన.

ఆ ఇద్దరూ ఒకప్పుడు భౌతిక శరీరాలు ధరించి ద్వంద్వాలకు లోబడిన వారే. ఇద్దరూ వారి వారి జీవితాలలో అసామాన్య వ్యక్తులే. ఒకడి జీవితం భూగోళం మీద గడిచిపోయింది. మరొకడు బతికి ఉండగా అంగారక గ్రహవాసి.

ఇప్పుడిద్దరికీ విముక్తి కలిగింది. ఇప్పుడు వారికి బ్రహ్మాండంలో పోరాని చోటులేదు. తెలియరాని విషయం లేదు. మన మానవుల దృష్టిలో వారు కాలాన్నీ దూరాన్నీ జయించిన వారే. వారు జయించలేని కాలమూ దూరమూ మనము ఊహించుకోనైనాలేము.

వారు కలుసుకున్న ప్రదేశం భూమీ అంగారకుడూ సూర్యుడి చుట్టూ సంచరించే మార్గాలకు మధ్యగా ఉంది. అక్కడ గాలిలేదు కనక అక్కణ్ణించి ఆకాశం నీలంగా కనిపించక కాటుక రంగుగా కనిపిస్తున్నది. అక్కడ రాత్రింబగళ్ళు లేవు. ఎల్లప్పుడూ తారాగణమూ గ్రహాలూ స్ఫుటంగా కనిపిస్తున్నవి. తారలు మినుకు మినుకు మనకుండా నిలబడి వెలుగుతున్నవి. అక్కడికి భూమి సగం మాత్రమే కనిపిస్తున్నది. అంగారక గ్రహం మాత్రం మూడువంతులకు పైగా కనిపిస్తున్నది. గ్రహాలు సూర్యకాంతికి ఎదురుగా పోతున్నప్పుడు సూర్యకిరణాల తాలూకు అలల్లో కలుగుతున్న సంక్షోభం వారి సూక్ష్మ నేత్రాలకు కనిపించటమే కాక ఆనందం కూడా చేకూర్చుతున్నది.

"ఏమి ఈ సృష్టి సౌందర్యం!" అన్నాడు మానవుడు, చుట్టూ కలయజూస్తూ "నాకు విముక్తి కలిగిన క్షణం నించీ దీన్ని తనివిదీర ఆనందిస్తున్నాను – ఈ నిర్మాణాన్ని. ఈ వింత నాకు విసుగు కలిగించలేదు. ఇట్లా అనంతకాలం జరిగిపోయినా నాకు తృప్తే!"

మానవుడు నోరు తెరిచిన క్షణం నించీ కనిబొమలు ముడేసి అతని వంక అర్థం కాని వాడల్లే చూస్తున్న అంగారకేయుడు ఫక్కున నవ్వాడు.

"ఇందులో వింత ఏమిటి, వత్సా?" అన్నాడావృద్ధు. "అంతా లెక్క ప్రకారం జరిగి తీరవలసిందే. నువ్వు గణితజ్ఞుడివి కావల్లే ఉంది. మా మండలంలో మేమంతా కొలతగాళ్ళమే!"

"కొలతగాళ్ళనగా?... మీరంతా శాస్త్రజ్ఞులని విన్నామే!"

"శాస్త్రమా? మాది మొదటినించి చివరవరకూ కొలత శాస్త్రమే. వ్యక్తిని చెయ్యగానే–"

"మీరు వ్యక్తులను చేస్తారా?"

"లేకపోతే ఎట్లా? ఎప్పుడైనా ప్రమాదం జరిగితే జనసంఖ్య తక్కువయిపోదూ? నా మటుకు నేను ప్రమాదం వల్లనే విముక్తి పొందాను. నేను పోగానే మా జనసంఖ్య తొమ్మిది. తొమ్మిది తొమ్ముదులలో ఒకటి తగ్గిపోలేదా?"

"తొమ్మిది సంఖ్య ఏమిటి?"

"మీరు తొమ్మిది ఒంట్లతో తొమ్మిది మీద మరొక సంఖ్య (మానవ భాషలో పది) చేసుకున్నారు. మేము సున్నాను సంఖ్యగా వాడము. అట్లా వాడితే మా గణితమంతా తారుమారవుతుంది.... నేను చెబుతున్నట్టు నేను విముక్తి చెందగానే మా వాళ్ళు మరొకర్ని చేసుకుంటారు. ఒక యంత్రం తక్కువ అయినా మా పని ఆగిపోతుంది"

"యంత్రమా?" అన్నాడు మానవుడు నిర్ఘాంతపోయి.

"అవును మనమంతా ఏమిటి? యంత్రాలం కామా?"

"చాలా చిత్రంగా ఉంది. యంత్రంలో ఆత్మ ఉంటుందా? మనలో యంత్రం మాత్రమే కాక ఆత్మకూడా లేదా?"

ఈసారి నిర్ఘాంతపోవటం అంగారకేయుడి వంతు.

"ఆత్మ – అంటే?"

"భౌతిక స్వరూపం లేనిది. జీవినించి భౌతిక పదార్థం యావత్తూ రాలిపోయిన తరవాత మిగిలేది."

"అటువంటి దేమీలేదు!" అన్నాడు అంగారకేయుడు గట్టిగా. "ఉంటే నా లెక్కలన్నీ తప్పుపోవలసిందే!"

"జడ శరీరం విసర్జించి ఈ సూక్ష్మ శరీరం ధరించిన మీరు కూడా ఆత్మ లేదంటే నేనేం చెప్పనూ?"

వృద్ధు నవ్వాడు.

"ఇదా నువు గ్రహించింది? నీ జడశరీరం ఎప్పుడయితే నిర్మించబడిందో దాని వెంట – ఈ సూక్ష్మ శరీరమేకాదు – ఇంతకంటే సూక్ష్మ పదార్థ సహితములైన శరీరములూ అప్పుడే నిర్మాణమయినై. అవి ఒకదాని కంటె ఆలస్యంగా మరొకటి రాలిపోతై. ఏమీ మిగలదు. నాకు ఆ శరీర పదార్థాల తాలూకు లెక్కలన్నీ కరతలామలకమే. ఒక్క క్షణంలో నీకు అదంతా బోధ పరుస్తాను!"

"క్షమించండి!" అన్నాడు మానవుడు కంగారుపడి. అతనికి ఇంటెగ్రల్ కాల్క్యులస్ జ్ఞాపకం చేసుకోవాలనే ఇచ్ఛ ఎంత మాత్రమూ లేదు. "అయితే ఒకటి చెప్పండి. ఆ

సూర్యుణ్ణి చూడండి. ఆ సూర్య గోళంలో జీవితం సాధ్యమా? ఒకప్పుడు మీ గోళమూ మా గోళమూ అట్లాగే ప్రజ్వలిస్తూ ఉండేవని ఒప్పుకుంటారా? అటువంటిచోట జీవం అనేది బయలుదేరింది. అటు చంద్రమండలం వంక చూడండి. అక్కడ ఇప్పుడు జీవితం అసంభవం – మర్త్యులమాట చెపుతున్నాను సుమండీ! అక్కడ ఒకప్పుడు ప్రాణం ఉండి ఉండవచ్చును. ఒక గోళం చల్లారటం మొదలుపెట్టి పూర్తిగా చప్పబడి పొయ్యేలోపల ఆ గోళం మీదికివచ్చి పొయ్యే ప్రాణం అనేది దేవుడనే జ్యోతి తాలూకు రవ్వ అంటారా కాదంటారా?"

"ఉండు, ఉండు! నాకు బొత్తిగా అర్థం చేసుకోటానికి వీలులేని మాటలు బోలెడన్ని ఉపయోగించావు. ప్రాణం ఏమిటి? దేవుడేమిటి? అసలు నువు మాట్లాడుతున్నది దేన్ని గురించీ?" అన్నాడు వృద్ధు.

"దేవుడంటే తెలియకపోతేమానె ప్రాణం అంటేనూ ప్రాణి అంటేనూ తెలియదా? ప్రాణం అంటే చైతన్యానికి కారణభూతమయింది. ప్రాణి అంటే ప్రాణంలో కూడుకున్న యంత్రం – మీమాటే ఉపయోగింతాం!"

"చైతన్యానికి కారణభూతమయినది శక్తి. ఆ శక్తి కరిగిన లోహంలో ఉన్నదంతా ఘనీభవించిన లోహంలో ఉంది – ఇంచుమించుగా .... నీ సందేహం ఏమిటి?"

ఆ ముసలివాడితో వాదించటం చాలా కష్టమని కనుక్కోవటం మొదలుపెట్టాడు మానవుడు. కాని ఇంకా కొంచెం ప్రయత్నించి చూతామనుకున్నాడు.

"మీ గోళం మీద వ్యక్తులున్నారా లేరా? అటువంటి వ్యక్తులు చంద్రమండలంలో లేరేం?"

"అక్కడ ఉన్న యంత్రాలు మనకన్న సూక్ష్మ శరీరాలలో బయలుదేరుతున్నవి. మనకన్న ఒక్క శరీరం తక్కువ రాల్చుతై. అంతే భేదం.. నీ సందేహం తీరిందా?"

"పోనీ మనలో ఉన్న చైతన్యం రాళ్ళూ రప్పలూ మొదలైన వాటిల్లో ఉందా?"

"ఎందుకుంటుందీ? అవి యంత్రాలు కావు. మనం యంత్రాలం. మనం చేసే పని ఒక పద్ధతిగా ఉంటుంది."

"పోనీ ఇంకొకటి చెప్పండి, మనలో నేనూ నువ్వూ అనేది ఏమిటి?"

"ఈ యంత్రమే! మన చేతుల్లో పనిముట్లకు కూడా నేను నువ్వు అనేది తెలుసును. అయితే వాటికది తెలుసునని మనకు తెలియజేయటానికి మార్గం లేదు. మనం ఆ మార్గాలు సంపాదించుకున్న యంత్రాలం."

మానవుడి వాదనాశక్తి అయిపోయింది.

"ప్రపంచం యావత్తూ గణితశాస్త్రమేననీ ప్రతి వస్తువునూ కొలవవచ్చుననీ

అనుకోటం మానేసి మీ గణితానికీ మీ కొలతలకూ అతీతమైనదేమైనా ఉండేదేమోనని ఆలోచించకపోయినారా?" అన్నాడతను నిస్పృహుడై.

అంగారకేయుడు అంతలో గంభీరుడైపోయి క్లాసులో పాఠం చెప్తుతున్న ఉపన్యాసకుడి ధోరణిలో మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నీకు ఇంతవరకూ ఒక ముఖ్య విషయం చెప్పలేదు. నేను ఇంతవరకూ మా ప్రపంచం మీద తయారు చేయబడిన వ్యక్తులలోకెల్లా గొప్ప కొలతగాణ్ణి. నాకు విముక్తి కలగగానే నేను త్యజించిన శరీరాన్ని జాగ్రత్తగా కొలిచి ఆ నమూనామీద మరొక యంత్రం తయారు చెయ్యటానికి ముగ్గురు కొలతగాళ్ళు – ఒకరు కాదు, ఇద్దరు కాదు, ముగ్గురు! పూనుకున్నారు. ఇంత శ్రద్ధ ఏ ఇతర యంత్రానికీ చూపబడలేదని తెలుసుకొని నేను స్వయంగా కృషి చేసి సృష్టిని యావత్తూ ఒక్క విషయమైనా బీరు పోకుండా కొలత కిందికి తీసుకురావచ్చునని రూఢి చేశాను. నేను సూచించిన పద్ధతుల మీద అనేకమంది కొలతగాళ్ళు పూర్వం కొలతకు అతీతమని భావించబడుతూ వచ్చిన వాటిని కొలవటం ప్రారంభించారు.

"ఇప్పుడు కూడా నేను నా పని మానలేదు. ఈ ప్రపంచంలో కూడా నాకు కొత్తగా పరిచయం కలిగిన సమస్త సృష్టి రహస్యాలనూ నా అసామాన్య గణిత జ్ఞానం వల్ల కొలతకు తీసుకుని రాగలిగానని సగర్వంగా చెప్పుకోగలుగుతున్నాను. ఈ క్షణాన నాకు సృష్టి రహస్యమూ నా కొలతకు అతీతమైనదీ లేదు.

"ఈ కొత్త జీవితం ప్రారంభమైన తరవాత నేను అనేక గోళాల మీదికి వెళ్ళి చూశాను. మీ గోళం మీది యంత్రాలు నన్ను చాలా చిక్కుపెట్టినై. కాని వాటి పరివర్తనలను కూడా నేను జయప్రదంగా కొలవగలిగాను.

"ఇప్పుడు నాకు సృష్టిలో అర్థం కానిదిలేదు. ఇకముందు ఉండబోదని రూఢిగా చెప్పగలను. నీ అనుభవంలో ఏమైనా ఉందా?"

మానవుడు ఈ ఉపన్యాసం అమిత భక్తి శ్రద్ధలతో ఆలకించి అంగారకేయుడు చాలించగానే ఆయనకు సవినయంగా నమస్కారం చేశాడు.

"మీరు లోకోత్తర పురుషులు! సందేహం లేదు. నేను మీ గొప్పతనం ఊహించుకోగలనే కాని అర్థం చేసుకోలేను.

"నేను కళోపాసిని. నన్ను నాతోడి మానవులు తిరస్కరించారు. వారు ఆరాధిస్తున్న కళ నాకు తుచ్ఛంగా కనిపించింది. నేను చూసిన ప్రతిదానిలోనూ ఏదో వెల్తి ఉన్నట్టు కనిపించేది.

"నాకు చాలా చిన్నతనంలోనే ఇతరులు చూడలేని విషయాల్లో సౌందర్యం

కనిపించేది. నా ఏడో ఏట మా తల్లి చచ్చిపోయింది. (మా తల్లి అంటే నన్ను తయారు చేసిన యంత్రం అనుకోండి!) ఆ వార్త వినగానే నేను సంతోషంతో పొంగిపోయి "అహో! ఎంత అందమైన ఘటన!" అని కేకపెట్టాను.

"తరవాత ఎక్కడ ఏది జరిగినా నా బుద్ధికి ఆ ఘటన తప్పనిసరిగానూ, న్యాయంగానూ, అందంగానూ కనిపించేది. ఎందుకంటే కారణం చెప్పలేను.

"నేను నా పన్నెండో ఏట ఒక చిన్న కరపత్రం ప్రకటించాను. సృష్టి యావత్తూ కళతో కూడుకున్నదనీ, మానవచరిత్ర అంతా కళాదృష్టితో చూస్తే దానిలో ఎటువంటి లోపమూ కనిపించదనీ. మా దేశంలో ఆ సమయాన జరుగుతున్న విప్లవమూ, ఆ రోజుల్లోనే మా దేశపు మతాధికారి హత్య కావటమూ ఉదాహరణలుగా ఇచ్చి ఆ ఘటనల్లో ఉన్న సౌందర్యం గుడ్డివాడికి కూడా కనిపిస్తుందన్నాను.

"ఆ కరపత్రాన్ని బహిరంగంగా తగలపెట్టారు. నన్ను జైలులో కూడా పెట్టజూచారు. నన్ను రహస్యంగా చంపాలని ప్రయత్నాలు కూడా చేశారు.

"కొందరు కళావిదులు నేను రాసిన దానిలో అర్థం లేదంటూ వాదించారు. వారి వాదన ఏమంటే ఒక చిత్రం ఉంటే దాన్లో సాంతంగా చూడకుండా దాన్లో కళ ఉన్నదీ లేనిదీ చెప్పటం కష్టం కదా! నేను సృష్టి యావత్తూ చూడకుండా సృష్టి కళతో కూడుకున్నదని ఎలా చెప్పగలనని.

"దానికి నేను జవాబు రాశాను – సృష్టి కళతో కూడుకున్నదని నా విశ్వాసమేననీ, ఒక్కొక్క సృష్టి రహస్యమే ఒక్కొక్క సంఘటనే చూస్తున్న కొద్దీ నాకు విశ్వాసం దృఢమవుతున్నదనీ... క్షమించండి, నా సోది తమకు నిరర్థకమనిపిస్తున్నదేమో!"

"చెప్పు, చెప్పు" అన్నాడు వృద్ధు, "ఇంతదాకా వచ్చి చివరంటా వినక పోవటమేమి?" అన్నట్టు.

"ఒక్క ముక్కలో తేల్చేస్తాను!... ఈ నూతన జీవితంలోకి వచ్చిన తరవాత అనేక కొత్త విషయాలు చూస్తున్నాను. సృష్టిని గురించి నా జ్ఞానం అధికమవుతున్న కొద్దీ నా నమ్మకం దృఢమవుతున్నది. నేను మీ మాదిరిగా కొలవలేను కాని నేను చూస్తున్న ప్రతి అణువుకూ ఈ కళాయుతమైన సృష్టి చిత్రంలో స్థానం ఉంది. ప్రతి రేణువులోనూ పైకి చెప్పరాని సౌందర్యం ఉట్టిపడుతున్నది. మీరు సృష్టిని ఒక విధంగా అర్థం చేసుకున్నారు, నేనింకొక విధంగా అర్థం చేసుకున్నాను. ఇద్దరికీ ఇది అర్థం అవుతూనే ఉంది.

"అయితే మీరు దీన్ని చూసి ఏ విధమైన ఆనందమూ అనుభవించ లేకుండా ఉన్నారు. నాకు దీనివల్ల ఎడతెగని ఆనందం కలుగుతున్నది. మీకు ఒక్కొక్క నూతనాంశమూ మీ నమ్మకాన్ని దృఢపరుస్తున్న కొద్దీ మీ భయం కాస్తకాస్తే తగ్గుతుంది. నాకు ఒక్కొక్క

కొత్త విషయమే నా నమ్మకానికి అధారభూతమవుతుంటే నా ఆనందం ఆనాటికానాడు జాస్తి అవుతూ ఉంటుంది.

"మరొక్క విశేషం కూడా ఉంది. ఏనాడో సృష్టి యావత్తూ మీ ఎదుట సాక్షాత్కరించకపోదు. మీరు దాన్ని నిశ్శేషంగా కొలవలేకపోతారు. ఆనాటితో మీకూ సృష్టికీ రుణానుబంధం తెగిపోతుంది. నా విషయం అట్లాకాదు. నేను సృష్టినంతా చూడగలిగిననాడు దానివంక చూస్తూ దానికి కర్త అయినవాణ్ణి మెచ్చుకొంటూ అతని ప్రత్యేకత ఊహించాలని ప్రయత్నిస్తూ ఉండిపోగలను!"

*మొదటి ముద్రణ : కారుణ్యం కథల సంపుటి, ఫిబ్రవరి 1937*
*యువ కార్యాలయం, తెనాలి*